ప్రజాశక్తి

బుధవారం 26 ఏప్రిల్ 2023

5

అల్లూరి సీతారామరాజు

ప్రవీణ్ ప్రకాష్ తీరు దారుణం

ప్రజాశక్తి -అనంతగిరి: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దేముడు మాట్లాడుతూ, ఉపాధ్యాయులపై ఎటువంటి కారణాలు లేకుండా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఏకపక్ష నిర్ణయాలతో సస్పెండ్ చేయడం సమంజసం కాదన్నారు. అక్రమ సస్పెండ్స్ తక్షణమే నిలుపుదల చేయాలని, లేని పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రతినిధులు మల్లేశ్వరరావు, ఈశ్వరరావు, శెట్టి. పరమేష్, కె.ప్రకాష్, కె.రామారావు, జె.సుధారాణి, ఎం.భాను, పి.వనిత, పద్మావతి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎర్రబారిన అరకులోయ

- ప్రచారభేరి బహిరంగ సభ విజయవంతం
- ఏజెన్సీ నలుమూలల నుంచి తరలివచ్చిన ఆదివాసీలు
- చైతన్యం రేకెత్తించిన బివి.రాఘవులు, జెవి.సత్యనారాయణమూర్తి ప్రసంగాలు
- ఆదివాసీల పొట్టగొడితే ఊరుకునేది లేదని నేతల హెచ్చరిక

మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు.బివి రాఘవులు, వేదికపై జెవి తదితరులు

ప్రజాశక్తి -అరకులోయ : అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రచార భేరి బహిరంగ సభ విజయవంతమైంది. ఈ నెల 14న ముంచంగిపుట్టు మండలంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రారంభమైన ఈ 'ప్రచార భేరి' అరకులోయ సభతో ముగిసింది. ఈ సందర్భంగా అరకులోయ ఎన్‌టిఆర్ పార్కులోని అల్లూరి సీతారామరాజు గ్రౌండ్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. పెట్రోల్ బంకు, ఎంపిడిఒ కార్యాలయం టౌన్‌షిప్ మీదుగా వైఎస్‌ఆర్ జంక్షన్, ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో సిపిఎం, సిపిఐ నాయకులు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్దపెట్టున నినాదాలు చేశారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, సిపిఎం నేతలు ఉమామహేశ్వరరావు, పొద్దు బాలదేవ్, రామారావులు ర్యాలీ అగ్రభాగాన నిలిచారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తరలిరావడంతో అరకులోయ ఎరుపు సంద్రంగా మారింది. డప్పుల శబ్దాలతో, గిరిజన సంప్రదాయ నృత్యాలతో దద్దరిల్లింది. బహిరంగ సభ ముగిసే వరకు నాయకుల ప్రసంగాలను జనం ఆసక్తిగా వినడం విశేషం.

బహిరంగ సభ సాగిందిలా..

బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవడానికి అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజన సంపదను లూటీ చేసి దోచుకెళ్లిపోవడానికి కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. ఆదివాసీలకు ఆర్థికంగా ఉపయోగపడే స్కీంలన్నింటినీ ఎత్తివేస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి రూ.20 వేల కోట్ల కోత విధించినా సిఎం జగన్ కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. గిరిజన ప్రాంతంలోని కాఫీ, జీడిపప్పుకు గిట్టుబాటు ధర కరువైందన్నారు. గిరిజన యూనివర్సిటీకి నేటి వరకూ భవనాలు నిర్మించలేదన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఏజెన్సీలో నేటికీ డోలీ మోతలే దిక్కు అవుతున్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య

బహిరంగ సభకు హాజరైన జనం

సిబ్బంది కరువయ్యారని తెలిపారు. నూతన విద్యా విధానం పేరుతో మన్యంలో విద్యను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉన్న విద్యాలయాలను మూసేసి పాడేరు వంటి చోట్ల మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే అవి ఎవరికి అవసరమని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్యను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజా ప్రతినిధులు మాట్లాడకుండా ఉండడం సరికాదన్నారు. ప్రజలకు అండగా నిలబడేది సిపిఎం, సిపిఐలు మాత్రమేనన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. అధికారులు ఈ చట్టాన్ని తుంగలో తొక్కడం వల్ల గిరిజనేతరుల ఆగడాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. బోయ/వాల్మీకిలను, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో కలపడానికి ప్రభుత్వం తీర్మానం చేస్తే గిరిజన ప్రజాప్రతినిధులు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఆదివాసీలు హక్కుల కోసం మాట్లాడితే నిర్బంధించడం అన్యాయమన్నారు. జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ అదానీ అభివృద్ధికే మోడీ కృషి చేస్తున్నారు తప్ప గిరిజనుల కోసం కాదని అన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలను రక్షించుకోవడానికి విస్తృత పోరాటం అవసరమని అన్నారు. రాష్ట్రంలో జగన్ నియంత పాలన కొనసాగుతోందని, ఎర్రవరం, చిట్టంపాడు, తదితర చోట్ల ఐదు హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మించడానికి పూనుకున్నారని తెలిపారు. గిరిజనుల సాగు భూముల్లో డ్యాములు కడుతుంటే గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలు తెలిసినా ప్రజలు ఎన్నుకున్న రాజకీయ నాయకులు కీలుబొమ్మలుగా ఉండడం దురదృష్టకరమన్నారు. జగన్, నరేంద్ర మోడీ గిరిజనుల కోసం ఎటువంటి అజెండా రూపొందించలేదన్నారు. అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు మాట్లాడుతూ మోడీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రొంపిల్లి పంచాయితీలో భూస్వాములు గిరిజనుల భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని తెలిపారు. బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోడీని గద్దె దించితేనే గిరిజన హక్కులు, చట్టాలు రక్షించుకోవడం సాధ్యపడుతుందన్నారు. సభలో సిపిఎం నేతలు పోతురాజు, రామారావు, జయ, సన్నిబాబు, హైమావతి, త్రినాథ్, సుందరరావు, నాగులు, లక్ష్మణ్, పృథ్వీరాజ్, భీమరాజు, సర్పంచులు చిన్నబాబు, మొస్య, బాలదేవ్, శరభన్న, సత్యనారాయణ, ఎంఎం.శ్రీను, రామారావు, రామన్న పాల్గొన్నారు.

భారీ ర్యాలీ చేపడుతున్న రాఘవులు, నాయకులు

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సస్పెన్షన్లపై నిరసన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉపాధ్యాయుల సస్పెన్షన్లపై ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాజవొమ్మంగి మంగల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పైడిమల్లు, పి.రమణ మాట్లాడుతూ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలల పర్యవేక్షణ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులను సస్పెన్షన్లకు గురి చేస్తూ దోషులుగా చిత్రీకరించడాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేసినట్లు చెప్పారు. 25న నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కాగా, 26న స్పాట్ కేంద్రాల వద్ద భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పాత తాలూకా కేంద్రాలలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు సత్యవతి, నాయకులు ఎం రమేష్ బాబు, పీవీ సుబ్బారావు, టీవీఎల్ ప్రసన్న, బి వెంకటలక్ష్మి, ఎన్ రాజబాబు, జి త్రినాథ్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సాదాసీదాగా మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంప చోడవరం మండల పరిషత్తు సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బంధం శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిడిఒ కుమార్ బాబు మండలంలోని పలు అంశాలను ప్రస్తావించారు. వివిధ శాఖల అధికారుల తమ శాఖల పురోగతిపై వివరించారు. ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని రోడ్లు, తాగునీరు తదితర సమస్యలపై ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి వివి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి జాన్ మిట్ల, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలతో అస్తవ్యస్తం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇటీవల నిత్యం వర్షం కురుస్తుండడంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణం అస్తవ్యస్తంగా మారుతోంది. వాన నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి పలు ప్రదేశాలు అధ్వానంగా తయారవుతున్నాయి. దీంతో, జన జీవనానికి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఫారెస్ట్ క్వార్టర్స్ సమీపంలోని పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారి పక్కన వర్షం నీరు నిలిచి పోవడంతో అధ్వానంగా ఉంది. సుండ్రుపుట్టు, లోచలిపుట్టు వీధుల్లోని రోడ్లు వాన నీటి నిలువతో అధ్వానంగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహన రాకపోకలకు అవాంతరం ఏర్పడుతోందని చెబుతున్నారు. జన సంచారానికి అంతరాయం కలగడంతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారిపై నిలచిన వర్షపు నీరు

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కుటుంబ నియంత్రణ పట్ల గిరిజనులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. మంగళవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలో 11 మండలాల ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లతో నిర్వహించిన సమావేశంలో రక్తహీనతపై ఆరా తీసిన కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ చేసుకోవడం తో లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. పునరుత్పత్తి హక్కు అయినందున, ఎవరినీ బలవంతం చేయరాదని, వారికి అవగాహన కల్పించి వారి నిర్ణయానికే విడిచి పెట్టాలని సూచించారు. జిల్లాలో అనేకమంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలు రక్త హీనతతో భాద పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి వారికి తగు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, చికిత్సలు అందించాలన్నారు. ముఖ్యంగా ఐరన్ పోలిక్ ఏసిడ్, మల్టీ విటమిన్లు అందించాలని సూచించారు. ఇతర వ్యాధులతో భాద పడుతున్న వారిని గుర్తించి తగు చికిత్సలు అందించాలని ఆదేశించారు. గర్భవతులను ముందుగానే గుర్తించి నమోదు చేయడంతో వారిని ట్రాక్ చేయడానికి వీలవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సిహెచ్ నమోదు ముందుగా చేయాలని పలువురు సిడిపిఓలు కలక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించి ఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రతి సూపర్వైజర్ నెలలో కనీసం పది నుండి 15 గ్రామాలలో పర్యటించాలని, అంగన్వాడి కార్యకర్తలకు రక్త హీనత, గర్భిణీ, బాలింతల నమోదు పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండలాల వారీగా నలుగురు కన్నా ఎక్కువ మంది పిల్లలను కన్న వారి వివరాలు సేకరించి వారికి, ఆయా గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, తహసిల్దార్, ఎంపిడిఓల ద్వారా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.సూర్యలక్ష్మి, సిడిపిఓలు, సూపెర్వైజర్లు, కార్యాలయ పర్యవేక్షకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తం

- మలేరియా నివారణ అందరి బాధ్యత

- ఐటిడిఎ పిఒ వి.అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్

కీటక జనిత వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ అన్నారు. మలేరియా నివారణ బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మంగళవారం ప్రప్రంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద మలేరియా నివారణపై అవగాహనా ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రాంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో మలేరియా నివారణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. దోమల పెరుగుదలను అరికట్టడానికి డ్రైడేలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. శుక్రవారం, సోమవారం, బుధవారాలలో డ్రైడే పాటించాలని స్పష్టం చేసారు. దోమ తెరల వినియోగంపై గిరిజనులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ర్యాలీని అంబేడ్కర్ కూడలి నుండి ఐటిడిఎ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ, చలి జ్వరం వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మలేరియా పరీక్షలు చేయించు కోవాలన్నారు. దోమలు కుట్టడంతో మలేరియా జ్వరం వస్తుందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన దోమతెరలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు సాంబశివరావు, రామారావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ కూడలి వద్ద అంతర్జాతీయ మలేరియా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు వై.హరికృష్ణ, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ కె.ఆదిరెడ్డి, మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమతెరలు వాడండి మలేరియాను తరమండి అంటూ వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి వైవిఎస్ రమణమూర్తి మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల మురికి గుంతలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి మలేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రికి రావాలని కోరారు. డాక్టర్ వై హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం మంజూరు చేసిన దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న పిఒ అభిషేక్

టిడిపి ఓటర్ల తొలగింపునకు వైసిపి కుట్ర

మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు

వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ఓటర్లను జాబితాలను నుంచి తొలగించే కుట్ర చేస్తోందని పాడేరు మాజీ శాసనసభ్యులు, ఆ పార్టీ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. నియోజకవర్గ, మండల స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు వివిధ విభాగాల వారికి ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం పాడేరులో నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు తెలుగుదేశం పార్టీకి పోలయ్యాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై గిరిజనుల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. ఓటమిని చవి చూడాల్సి వస్తుందన్న భయంతోనే తెలుగుదేశం పార్టీ ఓటర్లను కావాలనే తొలగిస్తోందని విమర్శించారు. సాంకేతికంగా తొలగిస్తున్న ఓటర్లను గుర్తించి వారిని మళ్లీ చేర్పించాలన్నారు. కొత్తవారిని కూడా చేర్పించాలని చెప్పారు. ఈ శిక్షణా తరగతులకు తెలుగుదేశం పార్టీ పరిశీలకులు రాజమండ్రి నారాయణ, తెదేపా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గోవిందరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ సహకారంతో యోకో హమా హైవే టైర్స్ కంపెనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోకో హమా ఆఫ్ హైవే టైర్స్ సంస్థ ఆధ్వర్యాన ఇంటర్, డిప్లొమో, ఐటిఐ, గ్రాడ్యుయేట్ కలిగిన మహిళా అభ్యర్థులకు శిక్షణ అందిస్తారు. 3 నెలల శిక్షణ తరువాత రు.15 వేలు వేతనం ఉంటుందని తెలిపారు. మహిళలు అర్హులని తెలిపారు. ఈనెల 27న జి.ఎం.అర్ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు. శిక్షణ కాలం లో భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరములకు ఫోన్ నెంబర్లకు: 9014767230, 9398338105 సంప్రదించాలని కోరారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

బందపల్లి సచివాలయాన్ని సందర్శించిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని బందపల్లి సచివాలయాన్ని మంగళవారం రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి వివి శ్రీనివాసరావు సందర్శించారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. పంచాయితీలో ఉన్న పలు సమస్యలు గురించి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని బందపల్లి పంచాయితీ కార్యదర్శి మహేష్‌ను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. ఈ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి నియోజకవర్గంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని స్థానిక ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ చెప్పారు. మండల కేంద్రంలో సందర్శించి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు నియోజకవర్గం పరిధిలో 90 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశామని, మరో 10 శాతాన్ని ఈనెల 29 లోపు పూర్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లో పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగా 78,650 స్టిక్కర్లను అంటించడం జరిగిందన్నారు. దీంతో పాటు ప్రభుత్వానికి మద్దతుగా ప్రజల నుంచి 26,700 మిస్డ్ కాల్స్ కూడా వచ్చాయన్నారు. ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వాళ్ళతో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడే వారి కష్టసుఖాలు తెలుసుకోవడంతో పాటు పరిపాలన తెలుస్తుందన్నారు. ప్రతినెల 1న తెల్లవారు నుంచి వృద్ధులకు పింఛన్లు అందించడంతో పాటు నిరుపేద విద్యార్థులకు అమ్మ ఒడి, జగనన్న తోడు, జగనన్న చేదోడుతో పాటు పలు పథకాలను అమలు ఆర్థికంగా భరోసా కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బి.ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానికమ్మ, వైస్ ఎంపీపీ లలిత, మాజీ జెడ్పిటిసి ఎం.శ్రీరాములు, సర్పంచ్ వి వెంకటరావు, ఉపసర్పంచ్ జగ్గు నాయుడు, వైసీపీ నాయకులు బి.సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, సర్పంచ్ జి.నాగేశ్వరరావు, శాంత కుమారి, చిరంజీవి ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ తదితరులు

రహదారి నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-మాడుగుల:రహదారి నిర్మాణానికి రూ.7.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం డి.గొటివాడ, శ్రీరాంపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిగొట్టివాడ నుండి మాడుగుల మోదమాంబ కాలనీ వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.7.5 కోట్లు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. గ్రామస్తులతో ముచ్చటించారు. తమది జవాబు దారి ప్రభుత్వమని, ఇచ్చిన మాట మేరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తమ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగానే ఉన్నారన్నారు. 479 ఇళ్లకు గాను ఇంటింటికి మంచి నీరు సరఫరా నిమిత్తం రూ.1.49 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, రెండు గ్రామాల్లోనూ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 16 లక్షలతో నాడు నేడు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, జడ్పిటిసి రమణమ్మ, తహశీల్దార్ రత్నం, ఎంపీడీఓ మీనా కుమారి, పెద్ద సంఖ్యలో వైసిపి నేతలు పాల్గొన్నారు

నష్టపరిహారం చెల్లించాలని రజకుల వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు నష్ట పరిహారం చెల్లించాలని డిఎల్ పురం గ్రామానికి చెందిన రజకులు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రజకులు మంగళవారం తహశీల్దార్ నీరజకు వినతిపత్రం అందజేశారు. తామంతా పూర్వం డి ఎల్ పురం గ్రామంలో కులవృత్తి రజక (బట్టలు ఉతకడం) వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామంలో బట్టలు ఉతక డానికి అనువైన స్థలం లేక పోవడంతో 100 సంవత్సరాల క్రితం బాపట్ల గ్రామానికి చెందిన కొడవటిపూడి రత్తయ్య తన స్వంత భూమి సర్వే నెంబరు 85లో 3-08 సెంట్ల భూమిని రజక వృత్తి చేసుకోవడానికి దానంగా ఇచ్చినట్లు తెలిపారు. ఆనాటి నుండి నేటి వరకు ఆ భూమిలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపిఐఐసి అధికారులు ఆ భూమిని సేకరించడం జరిగిందన్నారు. ఆ భూమిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నష్ట పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.దుర్గాప్రసాద్, ఎం.దేవుడు, జి.ముసలయ్య, ఎం.ఆదియ్య, పి.వీరన్న, బి.మన్నియ్య, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:సచివాలయ సిబ్బంది ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని ఎంపిడిఓ సీతారామరాజు, ఈ వోపిఆర్డి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని జానకయ్యపేట సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం సిహెచ్ లక్ష్మీపురంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాన్ని వెంటనే వాడుకలోకి తీసుకు రావాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో బోడపాలెం గ్రామంలో జీవిలి అనారోగ్యంతో మరణించిన దాకారపు వెంకటరమణ భార్య బుల్లమ్మకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నుండి 2 లక్షల పాలసీ సొమ్మును అందించినట్లు బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎరుకు నాయుడు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు బీమా మొత్తం చెక్కును అందజేశారు.

కానరాని 'నాడు నేడు'

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు పనులు గిరిజన గ్రామమైన అల్లుమయ్యపాలెం స్కూల్లో చేపట్టక పోవడం పట్ల విద్యార్థులతో పాటు గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవిలి గ్రామాన్ని సందర్శించిన ప్రజాశక్తి విలేకరి నాడు నేడు పనులు మంజూరు కాలేదా అని అడిగిన ప్రశ్నకు సమాధానం నాడు లేదు నేడు లేదు అని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, ఏళ్ళు గడుస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో శిథిలమైన భవనాన్ని విడిచి పక్కనే ఆంజనేయ స్వామి విగ్రహం చెట్ల కింద విద్యార్థులు చదువుకోవలసి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శిథిల భవనం పెచ్చులు ఊడిపడి పోతూ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని తొలగించి కొత్త భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రంగురాళ్ల తవ్వకాల్లో సూత్రధారులెవరో?

ప్రజాశక్తి-గొలుగొండ:గత రెండు రోజులుగా సంచలనంగా మారిన గొలుగొండ మండలం సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీ తవ్వకాల ఘటన ఇప్పుడు మరో సంచలనంగా మారతోంది. అటవీ శాఖ అధికారుల తీరు, చర్యలు విస్మయానికి గురి చేస్తున్నాయి. గత శుక్రవారం రాత్రి సాలిక మల్లవరం రంగురాళ్ల క్వారీలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ వాహనాలను ఉపయోగించి లారీలతో రంగురాళ్ల కలిగిన మట్టిని తరలించిన విషయం తెలిసిందే. దీంతో, ఇటు టీడీపీ, అటు అధికార వైసిపి పార్టీల నాయకులు సైతం విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు, తీసుకుంటున్న చర్యలు పలు అనుమానాలకు తావిస్తోంది. అక్కడ తవ్వకాలు జరిగినట్లుగా విషయం తెలుసుకున్న నర్సీపట్నం డిఎఫ్ఒ రాజారావు క్వారీని సందర్శించి ఎంత మేరకు మట్టి తవ్వారో కొలతలు వేయించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ, క్వారీలో తవ్వకాలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామని, వారి కళ్లుగప్పి ఈ తవ్వకాలకు పాల్పడ్డారని చెప్పారు. మరుసటి రోజు అసలు అక్కడ తవ్వకాలు జరగలేదని, పైపైన మట్టి మాత్రమే తవ్వారంటూ మాట మార్చడం పలు అనుమానాలకు తావిస్తోంది. డిఎఫ్ఒ రాజారావు ఇచ్చిన స్టేట్‌మెంట్లతో ఈ ప్రాంతీయులు అయోమయానికి గురయ్యారు. ఇంతలోనే స్క్వాడ్ డిఎఫ్ఒ శ్యామ్‌సుందరం ఆదివారం రంగురాళ్ల క్వారీని పరిశీలించి అక్కడ తవ్వకాలు జరిగాయని, కొంత మట్టిని తరలించుకుపోయారంటూ, తవ్వకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. తవ్వకాలు జరిగినప్పటికి నిర్లక్ష్యం వహించారంటూ ఫారెస్ట్ బీట్ అధికారి లోవకుమార్, స్ట్రైకింగ్ ఫోర్స్ ఉద్యోగి మహేష్‌లను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. దీంతో అటవీ అధికారులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా ప్రకటనలు చేయడం కింది స్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఈ ప్రాంతీయులను విస్మయానికి గురి చేస్తోంది. కోట్ల రూపాయల విలువైన రంగురాళ్ల తవ్వుకు పోయారంటూ రాజకీయ పార్టీలు ఆరోపణలు గుప్పిస్తుండగా అటవీ అధికారులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా తవ్వకాలు జరిగాయని ఒకరు, జరగలేదని మరొకరు, తవ్వకాలు జరిగాయని నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని తొలగించామని, ఇలా చర్యలు తీసుకోవడంతో ఈ

అటవీశాఖ అధికారుల హస్తంపై ఆరోపణలు

ప్రాంతీయులు విస్మయానికి గురవుతున్నారు. ఇంతకీ ఆ రోజు రాత్రి ఇక్కడ తవ్వకాలు జరిగాయా లేదా అని అటవీ ఉన్నతాధికారులు నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలో గత శుక్రవారం రంగురాళ్ల తవ్వకాలు జరగడం వెనుక డిఎఫ్ఒ రాజారావు హస్తం ఉందని ఈ ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. రేంజ్ అధికారి, బీట్ ఆఫీసర్ సెలవుపై వెళ్లడం, అదే రోజు రాత్రి భారీ ఎత్తున రంగురాళ్ల తవ్వకాలు జరగడం, తవ్వకాలు జరిగిన అనంతరం క్వారీని సందర్శించిన డిఎఫ్ఒ ఇక్కడ తవ్వకాలు జరిగాయని చెప్పడం, మరుసటి రోజే ఎటువంటి తవ్వకాలు జరగలేదని చెప్పడం, ఇదే సంఘటనలో ఇద్దరు ఉద్యోగులను బాధ్యులుగా చేస్తు సస్పెండ్ చేయడం వంటి అంశాలను పరిశీలిస్తే ఈ తవ్వకాలకు డిఎఫ్ఒ రాజారావుకు సంబంధం ఉన్నట్లుగా ఈ ప్రాంతీయులు చర్చించుకుంటున్నారు. క్వారీని సందర్శించి పైపైన మాత్రమే తవ్వారని పేర్కొన్న డిఎఫ్ఒ రాజారావు మరి సిబ్బందిని ఎందుకు సస్పెండ్ చేశారో అని పలువురు గుసగుసలాడుతున్నారు. దీన్ని బట్టి డిఎఫ్ఒకు తెలిసే ఇదంతా జరిగిందని పలువురు అనుకుంటున్నారు. అసలైన వ్యక్తులను తప్పించి దారి మళ్లించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకొని అటవీశాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తవ్వకందారులు ఎవరనేది అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. గత మూడు నెలల క్రితం ఆరిలోవ అటవీ ప్రాంతంలో జరిగిన తవ్వకాలకు సంబంధం ఉన్న కీలకమైన వ్యక్తులే సాలికమల్లవరంలో జరిగిన తవ్వకాల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని ఈ ప్రాంతంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో పెట్టిన కేసులు అలాగే ఉన్నాయి. ఈ తవ్వకాల కోసం తెలుగుదేశం నాయకులు ఆరోపించినట్లు కొంత మంది సెల్‌ఫోన్ల కాల్‌డేటాను పరిశీలిస్తే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది. కానీ అధికారులు అసలు చర్యలు చేపట్టడానికి సుముఖంగా ఉన్నట్లు కనిపించలేదు.

28న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మధురవాడలోని ట్రై జియో టెక్నాలజీస్‌లో జిఐఎస్, సిఎడి ఇంజినీర్లు 50 ఖాళీలకు సివిల్, మెకానికల్ డిప్లమో, బిటెక్ అర్హతతో 20 నుంచి 25 వయసు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.13,585 జీతం ఉంటుందని తెలిపారు. మద్దిలపాలెంలోని శ్రీనిధి అసోసియేట్స్‌లో టెలి కాలింగ్ వాయిస్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఏదైనా డిగ్రీ చేసి 18 నుంచి 25 వయసు గల మహిళలు అర్హులని, వీరికి నెలకు రూ.11 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని అప్టెక్‌లో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలర్ కం సోషల్ మీడియా బ్రౌజర్, అకౌంటెంట్ నాలుగు ఖాళీలకు ఏదైనా డిగ్రీ, ఎంబిఎ అర్హత కలిగి 22 నుంచి 30 సంవత్సరాలు గల వారు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు జీతం ఉంటుందని తెలిపారు.ద్వారకానగర్‌లోని ఫిన్‌కేర్ బ్యాంక్‌లో సేల్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 12 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హతతో 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, రూ.20 వేల నుంచి రూ.30 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఇక్షణ హోమ్‌కేర్ హెల్త్ సర్వీసెస్ కేర్ టేకర్స్, ఎఎన్ఎం, జిఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్ ఉద్యోగాల 10 ఖాళీలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమో, ఎఎన్ఎం, జిఎన్ఎం, నర్సింగ్ అర్హతలు కలిగి 18 నుంచి 35 సంవత్సరాలు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందని తెలిపారు. గవర కంచరపాలెంలోని క్రిష్ కార్ప్ లిమిటెడ్ (యాక్సిస్ బ్యాంక్)లో రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగి 18 నుంచి 39 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఆశీల్‌మెట్టలోని రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్స్యూరెన్స్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ చేసిన వివాహిత మహిళలు 27 నుంచి 50 మధ్య వయస్సు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.16 వేలు జీతం ఉంటుందని తెలిపారు. యుఎస్ఐటి రిక్రూటర్ ఉద్యోగాలు 15 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంబిఎ ఇన్ హెచ్‌ఆర్ అర్హత కలిగి 21 నుంచి 35 సంవత్సరాల వారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని వివరించారు. మధురవాడలోని రోవర్ ఐటి టెక్నాలజీస్‌లో బెంచ్ సేల్స్ రిక్రూటర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంబిఎ ఇన్ హెచ్ ఆర్ అర్హత కలిగి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గలవారు అర్హులని, నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని తెలిపారు. వెబ్ డెవలపర్ ఉద్యోగాలు 15 ఖాళీలకు బీటెక్ అర్హతతో 21 నుంచి 35 మధ్య వయస్సు గలవారు అర్హులని, నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. ఐటి రిక్రూటర్ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఇన్ హెచ్‌ఆర్ అర్హత కలిగి, 21 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని తెలిపారు. శ్రీ సాయి మధు ఇంజినీరింగ్ అండ్ టెక్ సర్వీసెస్‌లో ట్రైనీ ఆపరేషన్స్ ఉద్యోగాలు ఆరు ఖాళీలకు డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ అర్హత కలిగి, 18 నుంచి 25 మధ్య వయస్సు గలవారు అర్హులని, వీరికి రూ.10 వేల నుంచి రూ.12 వేలు జీతం ఉంటుందని పేర్కొన్నారు. బెంగళూరులోని కోజెంట్ ఈ సర్వీసెస్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు 30 ఖాళీలకు 19 నుంచి 35 సంవత్సరాల వయసు, ఏదైనా డిగ్రీ ఉన్న వారు అర్హులని, వీరికి నెలకు రూ.16 వేలు జీతం, ఇన్సెంటివ్ ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, 28వ తేదీన జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

కవగుంటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -రావికమతం: పేద ప్రజలందరికీ గ్రామ స్థాయిలోనే ఉచిత వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సదుపాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది రోగులకు డాక్టర్ శ్రావ్య వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీయూపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,వైద్య శిబిరం వద్దకు రాలేని రోగులకు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ కుమారి, ఏఎన్ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి- నాతవరం: మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారుమండల కేంద్రంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్మిక వాడలలో మే డేను ఘనంగా జరపాలన్నారు. మే 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. మేడే స్ఫూర్తితో ఉపాధి హామీ, భవన నిర్మాణ కార్మికలు, ఆటో, ఎడ్లబండ్ల, జీడిపిక్కల కార్మికలను కలుపుకొని గ్రామాలలో సిఐటియ జెండాలను అవిష్కరణలు జరపాలన్నారు. ఈ కార్యక్రమలో సిఐటియు లక్ష్మి, లక్ష్మిబాయ్, మాణిక్యం, అంగనావాడి యునియన్ నాయుకులు ఎన్.వసంతా, మణి, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు అమ్మాజీ, అప్పలనర్సా, రాజు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలపై టిడిపి రాజకీయం : వైసిపి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సాలిక మల్లవరంలో జరిగిన రంగురాళ్ల తవ్వకాల వివాదంలో టిడిపి నిజనిర్ధారణ కమిటీ పేరుతో హడావుడి చేయడం సిగ్గుచేటు అని వైసిపి మండల యువజన అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, వైసిపి అధికార ప్రతినిధి అప్పలస్వామినాయుడు, ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, పెదిరెడ్ల అప్పలనాయుడులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే ఆయన మంచితనం ముందు నిలబడలేక టిడిపి కుట్ర రాజకీయాలకు తెర లేపిందన్నారు. అసలు టిడిపిలోనే అధిక సంఖ్యలో రంగురాళ్ల వ్యాపారులు ఉన్నారని వారి పెట్టుబడుతూనే ఇటువంటి కాలం చెల్లిన ఆరోపణ చేస్తూ చవకబారు రాజకీయాలు చేస్తుందని పేర్కొన్నారు.టిడిపి అంటే తెలుగు దొంగల పార్టీ అని దోచుకో దాచుకో పంచుకో అన్న నినాదంతోనే తెలుగుదేశం పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. కొంతమంది రంగురాళ్ల వ్యాపారులు తమ వ్యవహారాలు బయటపడకుండా పెట్టుబడులు పెట్టి ఇటువంటి కుట్ర రాజకీయాలకు తెరలేపి ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సర్పంచులకు అవార్డులు

ప్రజాశక్తి-రోలుగుంట:పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మడలంలో నీరు సమృద్ధిగా ప్రజలకు అందజేయడానికి కృషి చేసిన ఎస్.కొత్తూరు సర్పంచ్ పోతలరాజు శేఖర్‌కు, బుచ్చింపేట సర్పంచ్ ఉలబాల చంద్రకు జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చేతుల మీదుగా శాలువతో సత్కరించి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఈఒపిఆర్‌డి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

శ్రమదానంతో శ్మశానం అభివృద్ధి

ప్రజాశక్తి-రోలుగుంట: నవతరం గ్రామీణ అభివృద్ధి సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో బుచ్చింపేట గ్రామంలో శ్మశానవాటిక ప్రాంత అభివృద్ధికి సంస్థలోని యువకులు నడుం బిగించారు. గ్రామ శివారులో ఉన్న ఈ ప్రాంతానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో శ్మశాన వాటికకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాలంటే ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యేవారు. వీరికి కష్టాలను గుర్తించిన నవతరం గ్రామీణ అభివృద్ధి సంస్థ యువకులు ఒక్క అడుగు ముందుకు వేసి ఈ సమస్యను తామే పరిష్కరించాలని లక్ష్యంగా చేసుకొని బాధ్యత తీసుకున్నారు. సంస్థ నిధులతో రైతుల వద్ద నుంచి గ్రామంలో నుంచి శ్మశానవాటికకు వెళ్ళే రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని సంబంధిత రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రహదారి మార్గాన్ని నిర్మించారు. దీనితో పాటుగా ఈ శ్మశాన వాటిక ప్రాంతం లోతుగా ఉండడంతో వర్షాకాలం లో దీనికి ఇరువైపులా ఉన్న పంట పొలాల నుంచి వచ్చే నీరు, వర్షపు నీరు చేరి అంత్యక్రియలు నిర్వహించ డానికి తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండేవారు. ఇది గ్రహించిన యువకులు ఈ సమస్యను తామే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తూ స్మశాన వాటికకు ఆనుకొని ఉన్న చుట్టూ ప్రక్కల పొలాలకు సంబంధించిన రైతులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను
రెగ్యులర్ చేయాలి

'ఎపి జెఎసి అమరావతి' జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ): కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎపి జెఎసి అమరావతి, జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి పిలుపుమేరకు మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11వ పిఆర్‌సి ప్రకారం నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగులకు కనీస వేతనం, హెల్త్ కార్డులు, ఇతర ప్రయోజనాలు కల్పించాలన్నారు..ప్రతి నెలా ఒకటిన జీతాలు, పెన్షన్లు ఇవ్వాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుతోపాటు పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు.

ఎపి రెవెన్యూ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎస్ఎ.త్రినాధరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సమస్య 20ఏళ్లుగా పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒల జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, నగర కార్యదర్శి వి వి సత్యనారాయణ, నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు మోహన్, సురేష్, గోపి, బ్రహ్మం, ఎఐటియుసి నాయకుడు తెడ్డు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.600 కోట్లతో కెజిహెచ్ అభివృద్ధి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి రజని

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు పొరుగు జిల్లాల ప్రజలకూ విశిష్ట వైద్య సేవలు అందిస్తున్న కెజిహెచ్‌లో రూ.600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభం కాగా మరికొన్ని దశలవారీగా జరుగుతున్నాయని వెల్లడించారు. కెజిహెచ్‌లో కొంతకాలంగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న సుబ్బరామిరెడ్డి సత్రాన్ని రూ.50 లక్షలతో ఆధునికీకరించగా మంగళవారం ఆమె ఆ సత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 200 పడకలతో, మహిళలు, పురుషులకు వేరువేరుగా ఈ సత్రాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కేవలం రోగుల సహాయకుల కోసం ఆధునికీకరించబడిన ఈ సత్రంలో బస చేసే సహాయకులు ఒక్కొక్కరూ రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఉండేవారికి రెండు పూటలా భోజనం, ఇతర సౌకర్యాలు ఉచితంగా లభిస్తాయన్నారు. దీని ఆధునికీకరణకు రూ.30 లక్షల సిఎస్‌ఆర్ నిధులను కలెక్టర్ సమకూర్చగా, రూ.20 లక్షలను ఇస్కాన్ సంస్థ ఇచ్చిందన్నారు.

కెజిహెచ్‌లో అభివృద్ధి పనులకు హెచ్‌పిసిఎల్ సంస్థ సిఎస్‌ఆర్ నిధులు రూ.2.6 కోట్లు ఇటీవల ఇచ్చిందని, అలాగే 25 అంబులెన్స్‌లు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కెజిహెచ్‌ను అతిపెద్ద కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. నాడు - నేడులో భాగంగా కెజిహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎంపీ ఎంవివి.సత్యన్నారాయణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇస్కాన్ ప్రతినిధి సాంబదాస్, కార్పొరేటర్ కె.అప్పలరత్నం తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు
కేంద్రం న్యాయం చేయాలి

కూనవరంలో ప్రచారభేరి పోస్టర్ల ఆవిష్కరణలో సిపిఎం నేతలు

ప్రచార భేరిలో సిపిఎం నాయకులు

వి.ఆర్.పురంలో ప్రచారభేరి పాదయాత్ర

ప్రజాశక్తి-కూనవరం :పోలవరం నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వమే ప్యాకేజీ ఇచ్చి వారికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు ప్రచార భేరి కార్యక్రమం మండలంలోని రేపాకలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే నెల 4వ తేదీన జరగనున్న బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ రేపాక గ్రామాన్ని 41 కాంటూరులో చేర్చి పూర్తిగా ఆర్ అండ్ ఆర్ గ్రామంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. చింతూరులో మే 4న జరగనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజానీకం తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, నాయకులు బాబు బొర్రయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వే చేసిన కుటుంబాలను నోటిఫికేషన్‌లో చేర్చాలి

విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి కన్నాయిగూడెంలో పోలవరం ఆర్అండ్ఆర్ ఇళ్ల సర్వే నిర్వహించిన కుటుంబాలను నోటిఫికేషన్‌లో చేర్చి వారికి ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. కన్నయ్యగూడెం గ్రామంలో మంగళవారం ప్రచార భేరి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ వాళ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ముంపునకు గురైన అన్ని కుటుంబాలకు పునరావాసం ప్యాకేజీ చెల్లించే విధంగా చూడాలని స్థానికులు ప్రచార భేరి బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ 2022 వరదల్లో కన్నాయిగూడెం గ్రామం సర్వం కోల్పోయిందని, ఇప్పుడు మరో రెండు నెలల్లో వరదులు వచ్చే అవకాశం ఉన్నందున కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే యుద్ధ ప్రాతిపదికన నిర్వాసితుల రక్షణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మే 4న చింతూరులో బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనెం భీమయ్య, మడకం రాజు, బొర్రా ముత్యాలు, సవలం కన్నయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తునికాకు కార్మికులకు పెండింగ్ బోనస్ చెల్లించాలి

విఆర్.పురం మండలం ములకనపల్లి పంచాయతీ పరిధి వీరపాపన్న కుంట, గొల్లగూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు మంగళవారం ప్రచార భేరి నిర్వహించారు. ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ తునికాకు కార్మికులకు 2012- 2019 మధ్య పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను తక్షణమే చెల్లించాలని, తునికాకు కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, జీవో నెంబర్ 52ని రద్దు చేయాలని కోరారు. తునికాకు 50 ఆకుల కట్ట ధర రూ.5కు తగ్గకుండా ఇవ్వాలని, బోనస్‌లు కల్లాల్లోనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సవలం మారయ్య, సోయం భద్రయ్య, రవ్వ దుర్గారావు, రవ్వ దూతయ్య, శేషయ్య, శేఖర్ కారం, కన్నయ్య, సుమన్, రత్తయ్య, సృష్టి తిరుపతయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో కరపత్రాల ఆవిష్కరణలో గిరిజనంతో సిపిఎం నేతలు

ములకనపల్లి పంచాయతీలో ప్రచారభేరిలో సిపిఎం నేతలు

28న ఆశీలు వేలం పాట

ప్రజాశక్తి-హుకుంపేట:హుకుంపేట వారపు సంత ఆశీలు వేలం పాటు ఈనెల 28న ఉదయం 11 గంటలకు సర్పంచ్ సమిడ. వెంకట పూర్ణిమ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆసక్తి గల స్థానిక గ్రామ పంచాయతీకి సంబందించిన యువత రెండు రోజులు ముందుగా రిజిస్టరేషన్ ఫీజ్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

గంజాయితో ముగ్గురు విద్యార్థుల అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : గంజాయితో ముగ్గురు విద్యార్థులను అరెస్ట్ చేసినట్లు ఆరిలోవ సిఐ సోమశేఖర్ తెలిపారు. సన్ కళాశాలలో బిబిఎ థర్డ్ ఇయర్ విద్యార్థి ఎద్దుబాయిన వెంకట సాయికుమార్, మరో కళాశాలలో ఫుడ్ టెక్నాలజీ చదువుతున్న దిలీప్ కుమార్, పాలిటెక్నిక్ చేసి ఖాళీగా ఉన్న భువన్ చంద్ర ౦ సాగర్ నగర్ చేపల బజార్ వద్ద బీచ్ రోడ్‌లో గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో దాడి చేయగా నిందితుల వద ఐదు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

అంగన్వాడీ పిల్లలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖపట్నం : వీధికుక్కల బెడద నుంచి అంగన్వాడీ పిల్లలకు రక్షణ కల్పించాలని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టిడిపి సీనియర్ నేత, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. మంగళవారం విశాఖపట్నంలో ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్నయిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఐసిడిఎస్ ఆర్‌జెడికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నేత అప్పలనాయుడు

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం మెట్టవలసలో వీధికుక్కల దాడిలో సాత్విక అనే చిన్నారి మృతి చెందిన నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను తీసుకెళ్లి, తిరిగి ఇళ్లకు సురక్షితంగా చేర్చే బాధ్యత ఆయాలకు అప్పగించాలన్నారు. సాత్విక కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గం కుప్పిలి లక్ష్మీపురం అంగన్వాడీలో విషాహారం తిని పిల్లలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో, అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కలిశెట్టి కోరారు. దీనిపై ఆర్‌జెడి సానుకూలంగా స్పందిస్తూ, తగు చర్యలు చేపడతామని హామీనిచ్చారు.

కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒగా శిరీష

కె.శిరీష

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ): బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒగా విశాఖ జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీషకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఇఒ రమేష్‌నాయుడును కృష్ణాజిల్లా తిరుపతమ్మ దేవస్థానం ఇఒగా బదిలీ చేశారు. దేవాదాయశాఖ ఎసి బాధ్యతలతోపాటు కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష అదనపు బాధ్యతలు మరోమారు నిర్వహించనున్నారు.

గతేడాది జులై ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 29వరకు సుమారు తొమ్మిది నెలలపాటు కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా శిరీష బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో ఆలయ ఆదాయం పెంపు, భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అమ్మవారి మార్గశిర మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా అనకాపల్లిలో అన్యాక్రాంతమైన అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన కోట్ల విలువైన భూములను పరిరక్షించారు దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శిరీషకు మరోమారు కనకమహాలక్ష్మి దేవస్థానం ఇఒగా అదనపు బాధ్యతలు అప్పగించగా, ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

ఆర్‌టిసి అద్దె బస్సులకు టెండర్ గడువు నేడే

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ రీజియన్‌లో పలు రూట్లలో ఆర్‌టిసి అద్దె బస్సులకు టెండరు గడువు ఈనెల 26 సాయంత్రం ఐదు గంటలతో ముగుస్తుందని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. రూట్‌నెంబర్ 700 సింహాచలం నుండి విజయనగరానికి మూడు మెట్రో బస్సులు, రూట్ నెంబర్ '500వై' ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఎలమంచిలి వరకు 10 మెట్రో బస్సులు, రూట్ నెంబర్ '12 డి' ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి దేవరాపల్లికి ఐదు మెట్రో బస్సులు, రూట్ నెంబర్ 541 మద్దిలపాలెం నుంచి కొత్తవలసకు మూడు సిటీ ఆర్డినరీ బస్సులు, నర్సీపట్నం నుంచి విశాఖపట్నం వరకు ఒక ఎక్స్‌ప్రెస్, నర్సీపట్నం నుంచి చోడవరం వరకు రెండు పల్లెవెలుగు బస్సులకు టెండర్లు ఆహ్వానించినట్లు తెలిపారు. ఔత్సాహికులు ఆర్‌టిసి వెబ్‌సైట్‌లో ఎంఎస్‌టిసి ఇ-టెండర్ ద్వారా పాల్గొనాలని, ముందుగా డిడి తీసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.